క్లుప్తంగా

ఒకరిపై కేసు నమోదు

దామెర: బెల్టుషాపు నడుపుతూ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముత్యం రాజేందర్, ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన లింగమూర్తి బెల్టుషాపు నడిపిస్తూ అక్రమ మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సోమవారం రాత్రి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో లింగమూర్తి ఇంట్లో రూ. 14.930 విలువ చేసే అక్రమ మద్యం లభించినట్లు పేర్కొన్నారు. మద్యం స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు వారు వెల్లడించారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తూర్పాటి సునీత మంగళవారం ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

బీజేపీ బూత్ స్థాయి సమావేశం

రామన్నపేట: వరంగల్ కేఆర్ గార్డెన్‌లో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పాట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం తూర్పు నియోజకవర్గ బూత్ స్థాయి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా కేంద్ర మాజీ మంత్రి పాన్ రాధాకృష్ణన్, జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్ హాజరై మాట్లాడారు. బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు మరింత కష్టపడాలన్నారు. కార్యక్రమంలో రత్నం సతీష్‌షా, భాకం హరిశంకర్, సముద్రాల పరమేశ్వర్, వన్నాల వెంకటరమణ, జిల్లా ఇన్‌చార్జ్ కోమటిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పేమెంట్స్‌పై అవగాహన



కాజీపేట అర్బన్ : విద్యుత్ బిల్లుల చెల్లింపు ఆన్‌లైన్ పేమెంట్స్‌పై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం వరంగల్ డీఈ మల్లికార్జున్ కరపత్రం విడుదల చేశారు. సమయం, ఖర్చు, శ్రమ తగ్గించుకుంటు ఇంటి వద్ద నుంచే మొబైల్, ట్యాబ్, డెస్కటాప్, ల్యాప్‌టాప్‌ల నుంచి బిల్లులను చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఏఓ కమలాకర్, గణేష్, సర్వేశ్వర్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ నేషనల్ కోచ్‌గా శ్రీధర్

వరంగల్ అర్బన్ : గోవాలో అక్టోబర్ మూడు, నాలుగు వారాల్లో జరుగనున్న బ్యాడ్మింటన్ పోటీలకు బల్దియా బ్యాడ్మింటన్ కోచ్ ఎం.శ్రీధర్ ఎంపికయ్యాడు. జాతీయ స్థాయిలో జరిగే ఈ పోటీలకు శ్రీధర్ కోచ్‌గా వ్యవహరించనున్నారు.

కాజీపేట జంక్షన్‌లో తనిఖీలు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో సికింద్రాబాద్, కాజీపేట రైల్వే టికెట్ చెకింగ్ సిబ్బంది మంగళవారం తనిఖీలు చేపట్టారు. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డిప్యూటీ సీసీఎం పీ.ఎం.సుకేష్ దీపక్ ఆధ్వర్యంలో కాజీపేట, వరంగల్ మీదుగా ప్రయాణించే రైళ్లలో సుమారు 30 మంది టికెట్ చెకింగ్ స్టాఫ్ తనిఖీలు చేపట్టారు. టిక్కెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని జరిమానాలు విధించినట్లు స్థానిక రైల్వే కమర్షియల్ అధికారులు తెలిపారు. ప్రయాణికులు విధిగా టికెట్ కొనుగోలు చేసి ప్రయాణించాలని సూచించారు. లేని పక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో కాజీపేట సీటీఐ జనరల్ విజయ్‌కుమార్, సీసీఐ సజ్జన్‌లాల్ పాల్గొన్నారు.

రాజునాయక్‌కు పరామర్శ



కేయూ క్యాంపస్ : దుగ్గొండి మండలం బికాజిపల్లిలో ఈనెల 14న నిరుద్యోగ యువతి ప్రవళిక అంతిమయాత్రలో పాల్గొన్న కేయూ జేఏసీ విద్యార్థి నాయకులు, గిరిజన శక్తి వర్కింగ్ ప్రసిడెంట్ గుగులోతురాజు నాయక్‌పై పోలీసులు, బీఆర్ఎస్ నాయకులు దాడి చేయటంతో రాజునాయక్‌కు ముక్కుకు తీవ్ర గాయమైందని కేయూ విద్యార్థి జేఏసీ నాయకులు తెలిపారు. మూడు రోజులుగా హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో రాజునాయక్‌కు చికిత్స పొందుతున్నాడు. పలు విద్యార్థి సంఘాల బాధ్యులు రాజునాయక్‌ను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇడపాక విజయ్‌కన్నా, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్, పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి మొగిలి వెంకటరెడ్డి, బండి రాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రఘంటా అలంకరణలో భ్రమరాంబిక

- ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు
- మూడోరోజు చంద్రఘంటా, అన్నపూర్ణాదేవిగా దుర్గామాత



ఆత్మకూరు : చంద్రఘంటా అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న దుర్గామాత

ఐనవోలు: మండలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మూడోరోజు మంగళవారం భ్రమరాంబిక అమ్మవారు చంద్రఘంటా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఉదయం సుప్రభాతసేవ, నిత్యాహ్నికం, చక్రోపనిషత్ పారాయణము, శ్రీచక్రార్చన, త్రిశతి పారాయణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు కోరారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుశర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్‌వినాయక్‌జోషి, అర్చకులు నందనం మధుశర్మ, భాను ప్రసాద్, మడికొండ దేవేందర్ పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీశివమార్కండేయ, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు పెద్దకోడెపాక గ్రామంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఎస్‌పీటీ యూత్ ఆధ్వర్యంలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం అన్నపూర్ణదేవి అలంకరణలో దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చింది. పెద్దకోడెపాకలో అమ్మవారిని చంద్రఘంట అన్నపూర్ణదేవి అలంకరణలో కుంకుమపూజ, నిత్యమహోమాన్ని ఆలయ అర్చకులు అనుదీప్‌శర్మ, మార్త రాజ్‌కుమార్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడిశెట్టి రవీందర్, కోత్వాలు కిరణ్, అమ్మ అశోక్, ముల్కనూరి సాంబమూర్తి, కడవెండి ఆనందచారి పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో దేవి శరన్నవరాత్రి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. పెంచికలపేట, పోచమ్మసెంటర్‌లో శ్రీవేణుగోపాలస్వామి భజన మండలి ఆధ్వర్యంలో వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం దుర్గామాత చంద్రఘంట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. భజన మండలి సభ్యులు భజనలు చేపట్టారు.



అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



ఐనవోలు : చంద్రఘంటా అలంకరణలో అమ్మవారు



శాయంపేట : అన్నపూర్ణా దేవి అలంకరణలో..

పరకాలలో..

పరకాల: పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీదేవిశరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారికి అభిషేకంతో పాటు ప్రధాన కళశస్థాపన, దీక్షధారణ, అంకురారోపణ, అఖండదీపస్థాపన, అగ్నిప్రతిష్టాపనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడోరోజు అయిన మంగళవారం అమ్మవారు చంద్రఘంటా, అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, ఈఓ వెంకటయ్య, ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణం శర్మ, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోయిన కోడ్‌ఆఫ్ కండక్ట్ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ

శాయంపేట : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన రాజకీయ నాయకుల అవగాహన సదస్సు వెలవెలబోయింది. రాజకీయ నాయకులు, అధికారులు హాజరుగాకపోవడంతో ఎన్నికల నిర్వహణపై పట్టింపులేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. సదస్సుకు కేవలం ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఎస్సై దేవేందర్, ఆర్‌ఐ శరత్, పత్తిపాక సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు హాజరయ్యారు. రాజకీయ పార్టీల నాయకులను సభకు రావాలని కోరినప్పటికీ వారు రాలేదని ఎంపీడీఓ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు.

నేత్రదానంతో అంధులకు కంటిచూపు



సర్టిఫికెట్ అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

నడికూడ: నేత్రదానం చేస్తే అంధులకు కంటి చూపు కల్పించినవారవుతారని తెలంగాణ నేత్రదానం, అవయవ, శరీర దాతల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. మండలంలోని సర్వాపూర్ గ్రామానికి చెందిన కుర్ల మల్లయ్య (80) అనారోగ్యంతో మృతి చెందగా మృతుడి భార్య లక్ష్మి, కుమారుడు రాజేందర్, కుమార్తెలు రమ, కవిత, రజిత మృతుడి నేత్రాలను దానం చేసేందుకు ముందుకొచ్చారు. దీంతో అసోసియేషన్ సభ్యులు నేత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ మరణానంతరం నేత్రదానం చేసి అంధుల నివారణకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నేత్రదానానికి అంగీకరించిన మల్లయ్య కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపి నేత్రదాన సర్టిఫికెట్ అందించారు. తెలంగాణ నేత్రదానం, అవయవ, శరీర దాతల అసోసియేషన్ సభ్యులు జి.నరేందర్ పాల్గొన్నారు.

'కేసీఆర్ దోపిడీ పాలన అంతం చేద్దాం'

- కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

శాయంపేట : రాష్ట్రానికి నీళ్లు, నిధులు, నియమకాలు అంటూ గద్దెనెక్కిన కల్వకుంట్ల కుటుంబం ఉద్యమ సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర నాయకుడు దామెరకొండ కొమురయ్య అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆ వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 'కేసీఆర్ దోపిడి పాలన అంతం చేద్దాం-తెలంగాణను రక్షించుకుందాం' కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యమ సమయంలో నీళ్లు, నిధులు, నియమకాలు అనే అంశాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, సీఎం కేసీఆర్ అధికారం చేపట్టి తొమ్మిదేళ్లు గడుస్తున్నా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమయ్యారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించకుండా విద్యారంగాన్ని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ స్కాంలతో నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు చింతల రవిపాల్, మండల బీసీ నాయకులు మాచర్ల సదానందం, ప్రసాద్, శ్రీనివాసరావు, లింగయ్య, రంజిత్, వెంకటేష్, రఘు పాల్గొన్నారు.

నడికూడలో బెల్లం, పటిక పట్టివేత



స్వాధీనం చేసుకున్న బెల్లం, పటికతో ఏసీపీ

పరకాల: రహస్యంగా తరలిస్తున్న రూ.58వేల విలువ చేసే బెల్లం, పటికను పట్టుకున్నట్లు ఏసీపీ కిషోర్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నడికూడ మండల కేంద్రంలో తనిఖీలు చేస్తుండగా ఏపీ28క్యూ655 నంబర్‌తో ఉన్న మారుతికారు అనుమానస్పదంగా కనిపించిందని తెలిపారు. దీంతో పోలీసులు ఆపే క్రమంలో కారు నడుపుతున్న వ్యక్తులు పరారీ అయ్యారని పేర్కొన్నారు. అయితే కారును తనిఖీ చేయగా 32 బస్తాల బెల్లం, పటిక లభించిందని, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నాటుసారా తయారీ కోసం తరలిస్తున్నట్లు భావించి సీజ్ చేశామన్నారు. నింధితులు పోలీసుల ముందు లొంగిపోవాలని, లేని పక్షంలో చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సై రవీందర్ పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా సరిత

గీసుకొండ : మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా మండలంలోని కొమ్మాలకు చెందిన జక్కుల సరితను నియమించారు. ఈ మేరకు హనుమకొండలోని నివాసంలో పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి ఆమెకు నియామక పత్రాన్ని మంగళవారం అందజేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల ఎమ్మెల్యేగా ఇనగాలను గెలిపించడానికి మహిళలను చైతన్యవంతం చేసే కార్యక్రమాలను చేపడతానని సరిత తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ కార్యకర్త మృతి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పరకాల: గుండెపోటుతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్యకర్త మృతిచెందాడు. ఆయన మరణంతో పట్టణంలో తీవ్ర విషాదం నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మున్సిపాలిటీ 20వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రెండ్ల సమ్మయ్య(45) మంగళవారం వృత్తిలో భాగంగా కూరగాయాలు విక్రయించేందుకు మంగళవారం తెల్లవారుజామున మహాదేవపూర్‌కు వెళ్లాడు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అతడికి గుండెపోటు రావడంతో అక్కడే మృతిచెందాడు. మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణకు ప్రధాన అనుచరుడిగా ఉంటూ కాలనీలో ఏ సమస్య వచ్చినా చైర్‌పర్సన్‌కు సమాచారం అందించి పరిష్కరిస్తూ, నిత్యం వార్డులోని ప్రజలను పలకరిస్తూ సౌమ్యుడిగా పేరుతెచ్చుకున్న ఆయన మరణవార్తాని వార్డు ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. పట్టణానికి చేరుకున్న సమ్మయ్య మృతదేహానికి బీఆర్ఎస్ నాయకుడు సోదా రామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్ రెడ్డి, పార్టీ నాయకుడు శ్రీను నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆత్మకూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని నీరుకుళ్ల క్రాస్‌రోడ్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. నల్లబెల్లి మండలం రంగాపూర్‌కు చెందిన మార్త రమేష్ హనుమకొండ నుంచి బైక్‌పై రంగాపూర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నీరుకుళ్ల క్రాస్‌రోడ్ సమీపంలో ఆగిఉన్న లారీని ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ రవిరాజు తెలిపారు.

గ్రామైక్య సంఘాల సేవలను వినియోగించుకోవాలి

వర్ధన్నపేట : మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామైక్య సంఘాల ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సీసీ గోలి కొమురయ్య కోరారు. మండలంలోని ఇల్లంద గ్రామంలో గంగా గ్రామైక్య సంఘం నెలసరి సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించగా సీసీ మాట్లాడారు. న్యూ ఎంటర్‌ప్రైజెస్, ఫుడ్ ప్రాసెసింగ్ కార్యక్రమాల్లో భాగంగా సీఎంఎస్‌ఎం ఈజీపీ, తదితర రాయితీ రుణాలను ఉపయోగించుకోవాలని సూచించారు. తుంగభద్ర గ్రామైక్య సంఘం ప్రతినిధులు రూ.4 వేల విలువైన వాటర్ బాటిళ్లను 30 సంఘాల లీడర్లకు అందజేశారు. సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులు బొంతల మౌనిక, మోడెం కవిత, నీరజ, అశ్విని, ఎల్లమ్మ, జోగుల అనిషా, అనుమాండ్ల స్వప్న, వీఓఏలు స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

ఓంకార్ ఆశయాలను కొనసాగించాలి

గీసుకొండ : అసెంబ్లీ టైగర్‌గా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, ఎంసీపీఐ వ్యవస్థాపకుడు మద్దికాయల ఓంకార్ ఆశయాలను కొనసాగించాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి కోరారు. ఓంకార్ 15వ వర్ధంతి సందర్భంగా మండలంలోని మచ్చాపూర్ సమీపంలోని ఆయన స్తూపానికి మంగళవారం నాయకులు నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఓంకార్ దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా సమసమాజ స్థాపన కోసం జీవితాన్ని ధారపోశారని కొనియాడారు. ప్రొఫెసర్ మరింగంటి యాదగిరిచార్యులు మాట్లాడుతూ అంతరాలు లేని సమాజ నిర్మాణానికి కుల వ్యవస్థ అడ్డంకిగా ఉందన్నారు. సామాజిక న్యాయమే పరిష్కార మార్గమని ఓంకార్ బలంగా నమ్మారని చెప్పారు. అందుకోసమే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్)స్థాపించారని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనం సుధాకర్, కుంభం సుకన్య, గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, ఎన్‌రెడ్డి హంసారెడ్డి, నాయకులు గడ్డం నాగార్జున, వంగాల రాగసుధ, సావిత్రి, నాగెల్లి కొమురయ్య,కనకం సంధ్య, మైదంశెట్టి రమేశ్, తాండ్ర కళావతి, పల్లె మురళి పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



మహిళలతో కలిసి బతుకమ్మతో వెళ్తున్న చల్లా జ్యోతి

దామెర: సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సతీమణి చల్లా జ్యోతి అన్నారు. మండలంలోని ఊరుగొండలో మంగళవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొని బతుకమ్మ ఆడి కోలాట నృత్యాలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను ప్రతిఒక్కరూ ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. వేడుకల్లో జెడ్పీటీసీ గరిగె కల్పనకృష్ణమూర్తి, ఎంపీపీ శంకర్, వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, రైతు బంధు మండల చైర్మన్ బిల్లా రమణారెడ్డి, సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ బొల్లు రాజు, ఉప సర్పంచ్ సాగర్, మండల నాయకులు రాము, కేతిపెల్లి శ్రీధర్‌రెడ్డి, మెంతుల రాజు, అక్తర్, చంద్రమోహన్, వెంకటేశ్వర్లు, సునీల్‌రెడ్డి, దామెరుప్పుల శంకర్, దాడి మల్లయ్య, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీటీసీ సంపత్

వేలేరు : రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఎంపీటీసీ సభ్యుడు జల్తారి సంపత్ కోరారు. మండలంలోని పీచర గ్రామంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు ఐక్యమత్యంగా ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని సూచించారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, మభ్యపేట్టే మాటలను ప్రజలు నమ్మవద్దని కోరారు. అనంతరం గ్రామ సమన్వయ కమిటీ కన్వీనర్లుగా మండల సంపత్, గుండెల్లి అనిల్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వెంకన్న, ఓర్సు సమ్మయ్య, బైరబోయిన అంజయ్య, కదుగాయ మహేందర్, శ్రీనివాస్, ఎడపెల్లి నవీన్, జగదీష్ పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఆర్ అగ్రికల్చర్ స్కూల్ విద్యార్థినులు

నడికూడ: గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా ఎస్ఆర్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ విద్యార్థినులు రైతులకు పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలో మంగళవారం తేనెటీగల పెంపకం, రైతులకు అదనపు ఆదాయం వచ్చే పద్ధతులను వివరించారు. తేనెటీగల పెంపకంతో లాభాల గురించి, యాజమాన్య పద్ధతులపై, తేనెటీగల ఉత్పత్తి చేసే విధానంపై అవగాహన కల్పించారు. రైతులు పంటసాగుతో పాటు తేనెటీగల ఉత్పత్తిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు దీక్షిత, అనుచైత్రిక, లిఖిత, హర్షిత, శ్రీయ, రైతులు పాల్గొన్నారు.

పండుగపూట.. పస్తులేనా..!

- వేతనాలు చెల్లించాలని కార్మికుల వేడుకోలు



మాట్లాడుతున్న మల్టీపర్పస్ సిబ్బంది

శాయంపేట : గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చెత్తా, చెదారం తొలగిస్తూ డ్రెయినేజీని సైతం శుభ్రపరిచే తాము దసరా పండుగపూట పస్తులుండాల్సిందేనా అంటూ మండలంలోని వివిధ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మైలారంలో మంగళవారం మల్టీపర్పస్ సిబ్బంది మాట్లాడారు. 6 నెలల నుంచి వేతనాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కుటుంబ సభ్యులను పోషించుకోలేని పరిస్థితిల్లో ఉన్నామని, ఆర్థిక ఇబ్బందులతో అప్పులు చేసి ఆర్థికంగా కుంగిపోతున్నామని వాపోయారు. అధికారులు స్పందించి వెంటనే వేతనాలు చెల్లించాలని వేడుకున్నారు. చేరాలు, కిషన్, పోశాలు, ప్రశాంత్, గణేష్ పాల్గొన్నారు.

సీపీకి సన్మానం



సీపీని సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న అనుదీప్‌శర్మ

శాయంపేట : ఇటీవల వరంగల్ సిటీ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అంబర్ కిషోర్ ఝూను పెద్ద కోడెపాక శివాలయ ప్రధాన అర్చకుడు అనుదీప్ శర్మ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీని ఆశీర్వదించి శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించారు. 2014 సంవత్సరంలో వరంగల్ ఎస్పీగా పని చేసిన ఆయన అర్చకుడు అనుదీప్ శర్మ చేసిన పూజలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా అనుదీప్‌శర్మ మాట్లాడుతూ.. సిటీలో శాంతిభద్రతలను కాపాడాలని కోరారు. విధులు పట్ల అంకితభావంతో పనిచేసే కమిషనర్ వరంగల్‌కు బదిలీపై రావడం సంతోషకరమని కొనియాడారు. ఆయన వెంట నాయకులు ఇమ్మడిశెట్టి రవీందర్, కోత్వాలు కిరణ్, అమ్మ అశోక్, మోహన్, సాయి తదితరులు ఉన్నారు.

'ఇనుగాల'కు టికెట్ ఇవ్వకుంటే రాజీనామా

నయీంనగర్: కాంగ్రెస్ పార్టీ పరకాల ఎమ్మెల్యే టికెట్ ఇనుగాల వెంకటరామిరెడ్డికే ఇవ్వాలని, లేనిపక్షంలో పరకాల నియోజకవర్గం పట్టణ, మండల, గ్రామ, బ్లాక్, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, డివిజన్, పీఏసీఎస్ చైర్మన్లు అందరం మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని పరకాల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కమలాపురం రమేష్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నసమయంలో ఇనుగల పార్టీని కాపాడుకుంటూ కార్యకర్తలకు అండగా ఉన్నారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడుతూనే నమ్ముకున్న వారిని సర్పంచ్‌లను, ఎంపీటీసీలుగా గెలిపించుకున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పరకాల టికెట్ విషయంతో ప్రత్యేక దృష్టితో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇనుగాలకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పరకాల పట్టణ, మండల, గ్రామ, బ్లాక్, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, డివిజన్, పీఏసీఎస్ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.